నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 25 జూన్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

రైతుభరోసా పైసలు పడ్డాయో తెలుసుకునేందుకు అడ్డాకుల ఎస్‌బీఐలో క్యూలో నిలబడిన రైతులు

సారూ.. రైతు భరోసా వచ్చిందా..?

- బ్యాంక్ అధికారులను అడుగుతున్న అన్నదాతలు
- నిత్యం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడుతూ..
- ఖాతాలో సాయం పడక నిలబీస్తున్న రైతులు .. నీళ్లు నములుతున్న అధికారులు

'సారూ నాకు రైతు భరోసా వచ్చిందా..? వస్తే ఎన్ని ఎకరాలకు పైసల్ పడ్డవి.. ఎంత వచ్చింది సారూ'.. అంటూ రైతులు బ్యాంక్ అధికారులను అడుగుతున్నారు. ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పడంతో తమకు పడ్డాయా..? లేదా..? తెలుసుకొనేందుకు రైతులు నిత్యం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సాయం అందకపోవడంతో ఏ లెక్కన వేశారని ఓ వైపు రైతులు ప్రశ్నిస్తుంటే.. మరోవైపు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

– మూసాపేట, జూన్ 24

➡ ఓ రైతు (పేరు చెప్పడానికి ఇష్టపడని..)కు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆయనకు రూ.12 వేలు మాత్రమే రైతు భరోసా సాయం అందింది.

➡ మరో రైతుకు ఎకరం భూమి ఉన్నది. అతడికి రూ.9వేలు మాత్రమే వచ్చినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది.. ఇలా చెప్పుకుంటూ పోతే రైతు భరోసా వచ్చిందో? లేదో? అని తెలుసుకోవడానికి రైతులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అడ్డాకుల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఎస్‌బీఐ ఉన్నాయి. అయితే అడ్డాకుల ఎస్‌బీఐ ఉదయం తెరవకముందు రైతులు క్యూ కట్టారు. గంటల తరబడి రైతులు క్యూలో నిలబడాల్సి వచ్చింది. అందులో వృద్ధులు, మహిళలు ఉన్నారు. ఎస్‌బీఐ ఉమ్మడి మండలంతో పాటు అటు కొత్తకోట, ఇటు భూత్పూరులోనూ ఎస్‌బీఐ ఉన్నాయి. దీంతో అడ్డాకులలో మండలంతోపాటు మూసాపేట, పెద్దమందడి, కౌకుంట్ల, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామం వరకు ఖాతా దారులు ఉన్నారు. బ్యాంకులో సుమారుగా 90 వేల మందికిపైగా ఖాతా దారులు ఉన్నారు. బ్యాంకులో 4,500కుపైగా మందికి క్రాప్‌లోన్లు ఇచ్చారు. 2,600కుపైగా గోల్డ్ లోన్లు ఇచ్చారు. వీటితోపాటు అడ్డాకుల మండలంలోని పలు పరిశ్రమలు ఉండడంతో నిత్యం ఖాతాదారులతో కిటకిటలాడుతున్నది. దీనికితోడు రైతు భరోసా డబ్బులు పడడంతో రైతులు బ్యాంకుకు వద్దకు పెద్ద ఎత్తున వస్తుండడంతో కిటకిటలాడుతున్నది.



కిటకిటలాడుతున్న అడ్డాకుల ఎస్‌బీఐ

ఎప్పుడొచ్చినా ఇదే పరిస్థితి

అడ్డాకుల ఎస్‌బీఐ బ్యాంకు చుట్టూ నాలుగు రోజులుగా తిరుగుతున్నాను. కానీ ఎప్పుడు వచ్చినా క్యూ కట్టాల్సి వస్తుంది. ఎక్కువగా రైతులమే ఉన్నాము. రైతు భరోసా డబ్బులు పడ్డవా..? లేవా? అని ఆందోళనతోనే బ్యాంకుకు వచ్చి గంటల తరబడి క్యూలో నిలబడి వెళ్తున్నారు. డబ్బులు వచ్చినా సరిగ్గా డబ్బులు వచ్చాయా..? లేదా? ఎంత వచ్చిదో? అన్న భయంతోనే రైతులం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. బ్యాంకులో మరో రెండు కౌంటర్లు పెంచాలి. లేదంటే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– రఘునందన్‌రెడ్డి, ఖాతాదారుడు, అడ్డాకుల ఎస్‌బీఐ, మహబూబ్‌నగర్ జిల్లా

పాఠశాలకు తాళం వేసి ఉండడంతో బయట కూర్చున్న విద్యార్థులు

హత్య తర్వాత లడక్ వెళ్లాలని ప్లాన్..

తేజేశ్వర్‌ను హత్య చేసిన తర్వాత తిరుమలరావు, ఐశ్వర్య లడక్‌కు వెళ్లి కొన్ని రోజులపాటు అక్కడే ఉండి తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. బ్యాంక్ ఉద్యోగి అయినా తిరుమలరావు లడక్ వెళ్లడానికి బ్యాంక్‌లో రూ.20లక్షలు హోం లోన్ తీసుకున్నట్లు తెలిసింది. తేజేశ్వర్ మిస్ అయ్యాడని అతడి తల్లిదండ్రులు గద్వాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐశ్వర్యను విచారించగా అసలు విషయం బయటపడింది. ఒక హత్య మూడు కుటుంబాల్లో చిచ్చు రేపింది.

చదివింది పదో తరగతే.. అయినా తన అందం, మాటతీరుతో అందరినీ ఇట్టే ఆకట్టుకునే తీరు ఐశ్వర్యది. సోషల్ మీడియా ప్రభావంతో మరి కొంతమందితో పరిచయం పెంచుకున్న ఆమె ఒకరికి తెలియకుండా మరొకరితో ఫోన్‌లో చాటింగ్‌లు చేస్తూ వలపు వల విసురుతోంది కిలేడీ. అమాయకురాలిలా ఉంటూ కట్టుకున్నోడినే కడతేర్చింది..

కిలేడీ

- ఒకరికి తెలియకుండా మరొకరితో..
- ఐశ్వర్య సీక్రెట్ ఫోన్ కాల్స్ వ్యవహారం
- బ్యాంక్‌లో తిరుమల్‌రావుతో పరిచయం
- మరికొందరితో ఆమెకు సాన్నిహిత్యం ?
- అడ్డు తప్పించేందుకే భర్త తేజేశ్వర్ హత్య
- రూ.2 లక్షల సుపారీ ఇచ్చిన ఉదంతం
- ఇద్దరూ లడక్‌లో ఎంజాయ్ కోసం ప్లాన్
- వెళ్లేందుకుగానూ రూ.20 లక్షల హోం లోన్ తీసుకున్న తిరుమల్‌రావు
- పోలీసులకు దొరికిపోయిన వైనం

గద్వాల, జూన్ 24 : జిల్లా కేంద్రంలోని జమ్మిచేడుకు చెందిన సుజాతకు భర్త లేడు. ఆమె కర్నూల్ జిల్లా కల్లూరులో ఉంటూ ఓ ప్రైవేట్ బ్యాంకులో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. ఈ క్రమంలోనే సుజాతతో బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుమల్‌రావుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. సుజాత బ్యాంక్‌కు వెళ్లని సమయంలో తన కూతురు ఐశ్వర్య విధులు నిర్వహించడానికి వెళ్లగా, ఈ క్రమంలోనే తిరుమలరావు ఓ వైపు తల్లితోపాటు కూతురితో కూడా అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇది సుజాతకు నచ్చకపోవడంతో ఐశ్వర్యకు పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నది. గద్వాలకు చెందిన తేజేశ్వర్‌తో సంబంధం కుదుర్చుకొని నిశ్చితార్థం చేసుకున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన పెళ్లి జరగాల్సి ఉండగా, పెళ్లి ఇష్టం లేని ఐశ్వర్య తిరుమల్‌రావుతో 15 రోజులపాటు వెళ్లి పోయింది. ఆ సమయంలోనే తిరుమల్‌రావుకు ఐశ్వర్య ఓ ప్రతిపాదన పెట్టినట్లు తెలిసింది. నీ భార్యను చంపిన తర్వాతే మనిద్దరం పెళ్లి చేసుకుందామని చెప్పడంతో తిరుమలరావు అందుకు అంగీకరించాడు. 15రోజుల తర్వాత ఇద్దరూ తిరిగి వచ్చారు. తన భార్యను చంపడానికి తిరుమలరావు రూ.2లక్షలకు సుపారీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇది కుదరకపోవడంతో ఏం చేయాలో తోచక ప్లాన్–2 కిలేడి అమలు చేసింది. మొదట నిశ్చితార్థం అయిన తేజేశ్వర్‌తో లైన్ కలిపింది. కట్నం విషయంలో మా అమ్మకు, నాకు గొడవ జరగడం వల్ల మా ఫ్రెండ్ ఇంట్లో ఉన్నానని, నీవంటే నాకు ఇష్టం, నేను ఎవరి వెంబడి వెళ్లలేదని తేజేశ్వర్‌ను నమ్మించింది. తేజేశ్వర్ తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా మే 18వ తేదీన బీచుపల్లి ఆలయంలో వివాహం చేసుకున్నారు. పెళ్లైన తర్వాత కూడా ఐశ్వర్య ప్రియుడిని మరిచి పోలేకపోయింది. దీంతో ప్లాన్–3 అమలు చేశారు. తేజేశ్వర్‌ను చంపేస్తే ఇద్దరం ఎక్కడికైనా వెళ్లి హాయిగా జీవిద్దామని తిరుమల్‌రావు, ఐశ్వర్య మాట్లాడుకొని తేజేశ్వర్ హత్యకు ప్లాన్ చేశారు. తేజేశ్వర్ కదలికలు కనుగొనడానికి ఐశ్వర్య తన భర్త మోటర్ సైకిల్‌కు జీపీఎస్ ట్రాకర్ అమర్చింది. వివరాలను ప్రియుడు తిరుమలరావుకు చేరవేసేది. తేజేశ్వర్‌ను చంపడానికి కర్నూల్‌కు చెందిన నగేశ్, రాజు, పరశురాంకు తిరుమలరావు రూ.2లక్షలకు సుపారీ ఇచ్చాడు. ఈ క్రమంలోనే ఐశ్వర్య భర్త తేజేశ్వర్‌తో తమ బంధువులకు సంబంధించిన పొలం సర్వే చేసేది ఉందని, వెళ్లాలని చెప్పింది. ఇది నమ్మిన తేజేశ్వర్ వారి కారులో వెళ్లాడు. గద్వాల మండలం పూడురు శివారులో పొలం సర్వే చేసిన అనంతరం కారులో వెళ్తుండగా వెనక ఉన్న రాజు, పరశురాం తేజేశ్వర్‌పై కత్తులతో దాడి చేయగా, కారు నడుపుతున్న నగేశ్ తేజేశ్వర్ కడుపులో పొడిచినట్లు సమాచారం. ఈ పెనుగులాటలో నగేశ్ చేతికి బలమైన గాయమై కుట్లు పడినట్లు తెలిసింది. హత్య చేసిన తర్వాత ఈ సమాచారం తిరుమలరావుకు చెప్పగా, కర్నూల్ బైపాస్‌లో తిరుమలరావు నగేశ్, రాజు, పరశురాంను కలిసి తేజేశ్వర్ చనిపోయాడని తెలుసుకున్న తర్వాత వారికి రూ.2లక్షలు ఇచ్చి వెళ్లినట్లు సమాచారం. తిరుమలరావు బ్యాంక్ ఉద్యోగంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. పాణ్యం సమీపంలో తన రియల్ వెంచర్ ఉండడంతో అక్కడ తేజేశ్వర్ శవాన్ని పూడ్చాలని భావించారు. కుదరకపోవడంతో పాణ్యం సమీపంలో ఉన్న చెరువులోని జమ్ములో పడేశారు.

విచారణ వేగవంతం

- నిందితులతో పాటు కుటుంబీకులను విచారించిన పోలీసులు
- కారు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తిరిగిందోనని ఆరా..?
- నిందితులను పట్టుకోవాలని జోగులాంబ గద్వాల ఎస్పీ ఆదేశాలు

గద్వాల అర్బన్, జూన్ 24 : ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. మంగళవారం గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో తేజేశ్వర్ భార్య ఐశ్వర్య, అత్త సూజాతతోపాటు నిందితులు నాగేశ్, పరుశు, రాజుతోపాటు తేజేశ్వర్ కుటుంబ సభ్యులను పోలీస్ ఉన్న తాఢూరులు విచారించినట్లు సమాచారం. ఐశ్వర్యతో పరిచయం ఎలా అయింది.. ఎప్పుడు ప్రేమలో పడ్డాడు.. పెండ్లి ఎలా అయింది..? వీరి మధ్య మనస్పర్థలు ఏమైనా ఉన్నాయా..? అన్న విషయాలను విచారించారు. విచారణ, కేసును వేగంగా ఛేదించాలని జిల్లా పోలీస్ బాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నిందితులు వాడిన కారు పూర్తి డేటా సేకరించినట్లు తెలిసింది. షిఫ్ట్ కారుకు నెలకు రూ.25 వేల కిరాయి ఇచ్చేలా యజమానితో ఒప్పందం కుదుర్చుకొని తిరుమలరావు నిందితులకు అప్పగించినట్లు సమాచారం. ఈనెల 17న కర్నూల్ నుంచి వచ్చిన కారు గద్వాల కిష్టారెడ్డి బంగ్లా సమీపంలో తేజేశ్వర్‌ను ఎక్కించుకొని పూడూరు సమీపంలోకి తీసుకెళ్లినట్లు.. అక్కడే కారులో తెచ్చుకున్న ఆయుధాలతో అతడిపై దాడికి పాల్పడి ఉండొచ్చని.. హత్య చేశాక మృతదేహాన్ని కారు డిక్కీలో వేసినట్లు పోలీసులు అంచనా వేశారు. అనంతరం ఎర్రవెల్లి చౌరస్తా మీదుగా అలంపూర్ టోల్‌గేట్ టచ్ కాకుండా షార్ట్‌కట్‌లో కర్నూల్‌లోని పాణ్యం చేరుకొని మృతదేహాన్ని పడేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పాణ్యం నుంచి ప్రధాన రహదారిపై ఉన్న నన్నూర్ టోల్‌గేట్‌లో కార్‌కు సంబంధించిన పూర్తి డేటాను పోలీసులు సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా కారులో ఎవరెవరు ఉన్నారు..? అన్న విషయాలపై టోల్ నిర్వాహకులతో ఆరా తీసినట్లు తెలిసింది. షిఫ్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నల్లమల ఏజెన్సీ ప్రాంతంలో దుస్థితి

బస్సొస్తేనే బడి

- బక్కలింగయ్యపల్లిలో సింగిల్ టీచర్
- సెలవు పెడితే పాఠశాల బంద్

అచ్చంపేట రూరల్, జూన్ 24 : సర్కారు బడిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు.. మెరుగైన విద్య.. నాణ్యమైన మధ్యాహ్న భోజనం.. అన్ని సౌకర్యాలతో పాఠశాలలు నిర్వహిస్తున్నామని ఇటీవలే బడిబాట కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు గొప్పలు చెప్పారు. ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా నిర్వహణ కొనసాగుతున్నది. మంగళవారం 'నమస్తే తెలంగాణ' అచ్చంపేట మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల పాఠశాలలను విజిట్ చేయగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మండలానికి దాదాపు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ గ్రామాల్లో సర్కారు బడుల్లో విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షగానే మిగిలిందని చెప్పవచ్చు. ఆర్టీసీ బస్సు అచ్చంపేట, దేవరకొండ డిపోల నుంచి వస్తేనే బడి గంట మోగుతుంది. లేదంటే అప్రకటిత హాలిడే ఇక్కడ అమలవుతున్నది. మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆర్టీసీ బస్సును నమ్ముకొనే కొలువులు చేస్తున్నారు. ఉదయం ఆర్టీసీ బస్సుకు పోవడం, మళ్లీ తిరుగు ప్రయాణంలో బడికి తాళం వేసి ఆ యాకు తాళం అందించి అందిన వాహనం లో ఇంటికి చేరుకోవడం ఇదే తంతు నడుస్తున్నది. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలో అత్యవసరంగా సెలవు పెట్టుకుంటే ఆ రోజు బడి బంద్, విద్యార్థులకు సెలవు. ఒకవేళ టీచర్ బడికి రావాలంటే ఆర్టీసీ బస్సు రావాలి. బస్సు ఎప్పుడు వస్తే అప్పుడే బడి తలుపులు తెరుచుకుంటాయి. సమయ పాలన లేదు, ప్రార్థన అంతకంటే ఉండదు. ఇంతజరుగుతున్నా పట్టించుకోక పోవడం విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణంగా తల్లిదండ్రులు అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూలినాలి చేసైనా, ఫీజులు ఎక్కువైనా సమయం సరిపోకపోయినా తమ పిల్లలను నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నామని చెబుతున్నారు. ఉదయం 6గంటలకు ప్రైవేట్ బస్సు పిల్లలను ఎక్కించుకొని మళ్లీ సాయంత్రం 6గంటలకు ఇంటి వద్ద దింపుతున్నారని ఆవేదన చెందుతున్నారు. బక్కలింగయ్యపల్లిలో పనిచేసే టీచర్ పాఠశాలకు సెలవు పెట్టడంతో విద్యార్థులు తాళం వేసిన బడి ఎదుట బ్యాగులతో కూర్చున్నారు. అలాగే ఘణపూర్‌లో టీచర్ అరగంట బస్సుకు ఆలస్యం రావడంతో ఇద్దరు పిల్లలు పాఠశాల ఆవరణంలో ఉన్నారు. ఇక్కడి విద్యార్థులకు గుడ్డి గుర్తు ఏంటంటే.. ఆర్టీసీ బస్సులు వస్తేనే బడి లేదంటే సెలవని అర్థం. బస్సును చూసి అప్పుడు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పి బ్యాగును బడికి తీసుకొస్తారు. సమయ పాలన ఉపాధ్యాయులకు సంబంధం లేదు. వేసవి సెలవులు ముగిసి 12రోజులైనా ఇంకా పూర్తి స్థాయిలో విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు. టీచర్లు మాత్రం తప్పదు అన్నట్లు ఆర్టీసీ బస్సుకు పాఠశాలకు వచ్చి మళ్లీ సాయంత్రం అదే బస్సుకు వెళ్లిపోయి తమ విధులను పూర్తి చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాధికారులు దృష్టి సారించి సర్కారు బడుల్లో పనిచేసే టీచర్లు సమయ పాలన పాటించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటికి పారిపోవాలని..

- 2వ అంతస్తు నుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని
- తీవ్రగాయాలు, నిమ్స్ దవాఖానకు తరలింపు

వనపర్తి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : వనపర్తి మండలం కిష్టగానికి చెందిన తరుణి మర్రికుంట కేజీబీవీలో వారం రోజుల కిందట ఇంటర్ మొదటి సంవత్సరం(ఎంపీసీ)లో చేరింది. ఎస్ఎస్‌సీ కంచిరావుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేసింది. కేజీబీవీలో సీటు కోసం దరఖాస్తు చేయగా, ఎంపీసీలో మర్రికుంట కేజీబీవీలో ఇటీవలే చేరింది. కేజీబీవీలో చేరినప్పటి నుంచి ఇంటికి వెళతానంటూ ఒత్తిడి చేసింది. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లితండ్రులకు ఎస్‌వో తెలిపారు. రెండు రోజుల్లో వస్తామంటూ పనులపై ఉన్నందునా రాలేక పోయారు. దీంతో ఒత్తిడికి లోనైన తరుణి తెల్లవారుజామున కేజీబీవీలోని రెండో అంతస్తుపై నుంచి కిందకి దూకింది. వెంటనే అర్ధనాథాలు చేయడంతో ఘటనను గుర్తించిన తోటి విద్యార్థులు, రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది స్థానిక దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ దవాఖానకు అంబులెన్స్‌లో తరుణిని తరలించారు. విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్సను అందించేందుకు ప్రయత్నించారు. డీఈవో అబ్దుల్‌ఘని, డీసీడీవో సుబ్బలక్ష్మి దవాఖానకు వెళ్లి బాలికను పరామర్శించారు.

కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

మధ్యలో కోస్గి ఎస్సై

- ఇరువర్గాల మధ్యలో తలదూర్చి బాధితుడిని కొట్టిన వైనం
- ఫిర్యాదు చేయడానికి వచ్చిన బంధువుల గెంటివేత
- 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్‌పై చిందులు

కోస్గి, జూన్ 24: ఒక ఊళ్లో సోషల్ మీడియాలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య రేగిన వివాదం మధ్యలోకి ఎస్సై తలదూర్చాడు. స్టేషన్‌కి పిలిచి ఒకరిని కొట్టడంతో వివాదం ముదిరి చివరకు స్టేషన్‌లో ధర్నా చేసే వరకు వచ్చింది. వివరాలిలా..

సయ్యద్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముర్శీఫా గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి డైలాగ్‌తో ఉన్న ఓ వీడియోను తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. దీంతో అదే గ్రామంలోని మరో వర్గం కాంగ్రెస్ నాయకులు తమనుద్దేశించే ఈ వీడియో స్టేటస్ పెట్టాడని అతడితో గొడవకు దిగారు. దీంతో పంచాయితీ కాస్తా చివరకు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. ఇక్కడే ఎస్సై బాలరాజు తన తెలివి ప్రదర్శించాడు. బాధితుడు ఆటో డ్రైవర్ కావడం.. అతడి వెనక ఎవరూ లేరన్న సమాచారంతో.. నాయకుల మెప్పుకోసం అతడిని స్టేషన్‌కు పిలిచాడు. కానీ అప్పటికే ఫిర్యాదు చేయడానికి వచ్చిన సయ్యద్‌ను లోపలికి పిలిచి మరోవర్గం నాయకుల ఎదుటే అతడిపై చేయి చేసుకున్నట్లు తెలిసింది. 'చిలికిచిలికి గాలివానలా' ఈ ఘటన కాస్తా పెద్దదైంది. అయినా బాధితుడి బంధువులను సైతం తీసుకురావాలని ఎస్సై బాలరాజు సిబ్బందిని పంపించాడు. దీంతో ఆగ్రహించిన వారు ఎస్సైపై చర్యలు తీసుకోవాలని భీష్మించుకూర్చున్నారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' విలేకరి అక్కడకు వెళ్లి వివరాలు తెలుసుకుంటుండగా.. ఎస్సై బయటకు వచ్చి వీడియో తీయరాదంటూ చిందులు తొక్కారు. బాధితులు కూడా ప్రశ్నించడంతో అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. ఇంత జరిగినా ఏమాత్రం తగ్గకుండా 'ఎవరి క్షాగా చెప్పుకోండి.. నన్ను ఎవరూ ఏమీ పీకడు.. బొచ్చులోది ఈ పోలీస్ స్టేషన్ కాకపోతే.. మరో స్టేషన్' అంటూ దురుసుగా వ్యవహరించారు. కాగా స్టేషన్‌కు బాధితుడి తరపున గ్రామస్తులు చేరడంతో పోలీసులు వారికి సర్దిచెప్పారు. అనంతరం ఎస్సై బాలరాజుపై చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు చేశారు. లేకుంటే స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు హెచ్చరించాడు. అయితే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కోస్గి కాంగ్రెస్‌లో వర్గపోరు మొదలైంది. పలువురు నాయకులు సైతం బాహాటంగానే ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. కోస్గి ఎస్సైగా బాలరాజు బాధ్యతలు చేపట్టి నాటి నుంచి వివాదాలతో అందరి నోట్లో ఉన్నాడు. అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం వారు చెప్పిందల్లా చేస్తూ ఇతరులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు మూటగట్టుకున్నారు.

కోస్గి పోలీస్‌స్టేషన్ నుంచి సయ్యద్‌ను బయటకు పంపిస్తున్న పోలీసులు

రైతుభరోసా ఇవ్వాల్సిందే..

రైతుభరోసా డబ్బులివ్వాలని పాన్‌గల్ రైతువేదిక వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పాన్‌గల్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు పూర్తిస్థాయిలో అందించే వరకు ఉద్యమిస్తామని రైతులు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎకరా నుంచి తొమ్మిది ఎకరాల వరకు రైతు భరోసా డబ్బులు చెల్లించకుండా గొప్పలు చెప్పుకోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. చాలామంది రైతులకు అరకొరగా, మరికొందరికి పూర్తిగా డబ్బులు జమ కాలేదన్నారు. అర్హత కలిగిన ప్రతి సెంటు, గుంటకు సాగుకోసం పెట్టుబడి అందించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సన్నాలకు బోనస్, ఇందిరమ్మ జాతీయ భరోసా, రాజీవ్ యువవికాసం అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని బాల్యానాయక్ అన్నారు. చెప్పిన గ్యారంటీలు, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

కాలుష్యం నుంచి కాపాడాలి

- కంపెనీ వ్యర్థాలతో సాగుభూములు నాశనం
- కాలుష్య నియంత్రణ మండలికి రైతుల ఫిర్యాదు

ఎస్ఎన్ఎస్ ఫ్యాక్టరీ పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్

ఇటిక్యాల, జూన్ 24 : ఎర్రవల్లి మండలం జింకలపల్లె శివారులో ఏర్పాటు చేసిన ఎస్ఎన్ఎస్ స్టార్చ్ పౌడర్ తయారీ కంపెనీ నుంచి విడుదల అయ్యే కాలుష్యంతో సాగు భూములు పాడై పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, కాలుష్యాన్ని అరికట్టాలంటూ గ్రామస్తులు, రైతులు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు మొరపెట్టుకొన్నారు. పవర్ ప్లాంట్ బూడిద కలిసి భూములు సాగుకు పనికిరాకుండా పోయాయన్నారు. ఈ మేరకు మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ సురేశ్, నియంత్రణ మండలి అసిస్టెంట్ సైంటిస్ట్ విద్యుల్లత ఫ్యాక్టరీ పరిధిలో పర్యటించారు. రైతులతో కలిసి భూములను పరిశీలించారు. ఏండ్లనుండి సమస్య పరిష్కారానికి పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని, రైతులపై ఫ్యాక్టరీ యాజమాన్యం దౌర్జన్యం ప్రదర్శిస్తోందని గ్రామస్తులు తెలిపారు. గతంలోనే కాలుష్యాన్ని నివారించడానికి ఫ్యాక్టరీ నిర్వాహకులకు సూచనలు చేశామన్నారు. నీటి శాంపిల్స్ తీసుకొన్నామని, పరీక్షించాక తగిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం శ్రీనివాస రావ్, సిబ్బంది సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

కోడలి వేధింపులు భరించలేక అత్త ఆత్మహత్య

మరికల్, జూన్ 24 : కోడలి వేధింపులు భరించలేక అత్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మరికల్ మండలంలోని గాజులయ్యతండాలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి మరికల్ ఎస్సై రాము కథనం ప్రకారం.. గాజులయ్యతండాకు చెందిన సకీరమ్మ(70)కు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు గేనునాయక్, కోడలు జయమ్మ, వీరికు మారుడు జైసాయక్. కాగా, కోడలు జయమ్మ తరచూ అత్తతో గొడవ పడుతూ కొడుతుండేది. ఇందుకు కుమారుడు, మనువడు కూడా అలాగే వ్యవహరిస్తుండడంతో వేధింపులు భరించలేక మంగళవారం సకీరమ్మ గ్రామంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి పెద్ద కుమారుడు రాంసింగ్ నాయక్ ఫిర్యాదు మేరకు నేనునాయక్, జయమ్మ, జైపాల్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

- మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతాం
- బడిబాటలో విద్యాశాఖ అధికారులకు తల్లిదండ్రులు వెల్లడి

పంతుళ్లు లేకుంటే సదువెవరు చెబుతారు?

అలంపూర్, జూన్ 24 : పాఠశాలలో సరిపడా పంతుళ్లు లేక పోతే మా పిల్లలకు చదువులు ఎవరు చెబుతారు.. ప్రైవేట్ పాఠశాలకు తమ పిల్లలను పంపిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు తేల్చిచెప్పారు. అలంపురు మండలం సింగవరం–1లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో వెళ్లిన ఎంఈవో అశోక్‌కుమార్ అక్కడి విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల లేమిపై నిలదీశారు. గత విద్యాసంవత్సరంలో సింగవరం–1 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 30మంది విద్యార్థులుండగా, ఈ విద్యా సంవత్సరం కేవలం 9మంది మాత్రమే మిగిలారు. 1–5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. 5తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. ఇలా ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులు ఏం నేర్చుకుంటారని అడిగారు. దీంవిద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను కేటాయిస్తారని ఎంఈవో చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శివశంకరాచారి, గ్రామస్తులు శ్రీనివాసులు, మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో రైతులతో మాట్లాడుతున్న ఎంఈవో అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు